# వచ్చేది కారే.. ఏలేది కేసీఆర్ సారే

## డిసెంబర్ 3న మూడోసారి అధికారం మాదే ❖ జవహర్‌నగర్‌లో 40వేల మందికి పట్టాలు ఇచ్చాం

- అధికారంలోకి రాగానే.. ఒక్కో మున్సిపాలిటీకి రూ.10 కోట్లు ఇవ్వండి
- గిరిజనులు నిర్మించుకున్న 11వేల ఇండ్లకు పట్టాలు ఇవ్వాలి
- ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు మంత్రి మల్లారెడ్డి విజ్ఞప్తి
- సీట్లు అమ్ముకుంటున్న రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కాలిగోటికి సరిపోడని ధ్వజం





ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న మంత్రి మల్లారెడ్డి, సభకు హాజరైన జనం

మేడ్చల్, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) / మేడ్చల్ రూరల్ : డిసెంబర్ 3న మూడవ సారి బీఆర్‌ఎస్ పార్టీ జెండానే ఎగురుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మచ్చలేని లీడర్ కేసీఆర్ అని, ప్రజల హృదయాల్లో నిలిచారని, ముచ్చటగా మూడోసారి సీఎంగా గెలవడం ఖాయమని అన్నారు. పీల్చే గాలి, పారే నీరు, పండే పైర్లు.. తెలంగాణ జోరు.. అది కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. రాజకీయాలకతీతంగా సబ్బండవర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికి ఆదర్శప్రాయంగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. తక్కువ సమయంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దారన్నారు. ఓటమి లేని పథకాలతో రాష్ట్రం సంక్షేమంలో దేశంలో నంబరు వన్ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను చూసిన సమీప రాష్ట్రాల ప్రజలు తమకు కూడా కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, ఆది పురుషుడిగా ముఖ్యమంత్రి ప్రజలకు ఆరాధ్యుడయ్యాడని చెప్పారు. 10 నుంచి 33 జిల్లాలు చేసి, పరిపాలనా సౌలభ్యం కోసం కృషి చేశారని తెలిపారు. డిసెంబర్ 3న మూడోసారి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలువబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, సురభివాణీ దేవి, దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, ఎంపీపీలు రజితారాజమల్లారెడ్డి, ఎల్లుబాయి, జడ్పీటీసీలు శైలజావిజయానందా రెడ్డి, అనితాలాలయ్య, మేయర్లు జక్కా వెంకట్ రెడ్డి, మేకల కావ్య, సామల బుచ్చిరెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌లు మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, దీపికానర్సింహ రెడ్డి, పావనీజంగయ్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శైలజ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజమల్లారెడ్డి, భాగ్యారెడ్డి, సత్యనారాయణ, నర్సింహ రెడ్డి, దర్శన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### మేడ్చల్‌కు దేశంలోనే ప్రత్యేక స్థానం

మేడ్చల్ నియోజకవర్గం దేశంలో ఎక్కడా లేని విధంగా ఉందని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలు, 61 పంచాయతీలు ఉన్నాయన్నారు. ఇతర జిల్లాల ప్రజలకు నివాసయోగ్యంగా మారడంతో రోజు రోజుకు కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయన్నారు. ఇందులో 95శాతం మంది ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌కు చెందిన వారే ఉన్నారని తెలిపారు. నియోజకవర్గానికి రూ.40 కోట్ల సీఎం సహాయ నిధి ఇచ్చామంటే అది బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతే అన్నారు. జవహర్‌నగర్‌లో 58, 59 జీవోల కింద 40వేల మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తామని తెలిపారు.

### కేసీఆర్ గోటికి సరిపోని రేవంత్

ప్రజల ఓట్లతో గెలిచిన ఎంపీ రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా నియోజకవర్గంలో పర్యటించ లేదని, ఒక్క అభివృద్ధి కార్యక్రమంలో కూడా పాల్గొనలేదని మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. పీసీసీ పదవీని డబ్బులతో కొనుక్కున్న రేవంత్ రెడ్డి, నోట్లకు టికెట్లు అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ గోటికి కూడా సరిపోడని, ఎన్నికల్లో గెలిచేది లేదు, సచ్చేది లేదని అన్నారు.

### శామీర్‌పేట చెరువును టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దాలి

ఎన్నికల తర్వాత నియోజకవర్గం అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు మంత్రి మల్లారెడ్డి విన్నవించారు. ఘట్‌కేసర్ గురుకుల పాఠశాలలో స్థలం ఉన్నదని, దానిలో ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసేందుకు నిధులు ఇవ్వాలని, ఒక్కో మున్సిపాలిటీకి రూ.10 కోట్లు ఇవ్వాలని, శామీర్‌పేట చెరువును టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దాలని, తూంకుంట, శామీర్‌పేట మండలంలోని నిరుపేద గిరిజనులు నిర్మించుకున్న 11వేల ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

### బీఆర్‌ఎస్ అంటే స్కీంలు.. కాంగ్రెస్ అంటే స్కాంలు

బీఆర్‌ఎస్ అంటే స్కీంలు.., కాంగ్రెస్ అంటే స్కాంలు అని మంత్రి మల్లారెడ్డి అభివర్ణించారు. 75 సంవత్సరాల్లో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా పని చేసినా అభివృద్ధి చేయలేదన్నారు. తెలంగాణ సాధించి 9 ఏండ్లలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజంతా మద్దతివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### సీఎం సభ సైడ్‌లైట్స్

- సాయంత్రం 5:40 గంటలకు సీఎం సభ ప్రాంగణంపై హెలీకాప్టర్ చక్కర్లు కొట్టడంతో జై కేసీఆర్.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.
- 5:43 గంటలకు సభా ప్రాంగణం వెనుకాల ఉన్న మైదానంలో హెలీకాప్టర్ ల్యాండ్ అయ్యింది.
- మంత్రి మల్లారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హెలీప్యాడ్ వద్దకు వెళ్లి సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు.
- 5:45 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో సీఎం బయల్దేరి సభా వేదికపైకి 5:50 గంటలకు చేరుకున్నారు.
- సీఎం సభా ప్రాంగణంలో అడుగుపెట్టగానే ప్రజలు లేచి జై కేసీఆర్, జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు.
- 6:06 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 6.20 గంటలకు ముగించారు.
- సీఎం చదివిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను సభకు వచ్చిన ప్రజలు ఆసక్తిగా విన్నారు.
- మల్లారెడ్డిని మరోసారి గెలిపించాలని సీఎం కోరడంతో ప్రజలు చప్పట్లతో అంగీకారం తెలిపారు.
- మధుప్రియ, కళాకారులు ఆడి, పాడి ఆకట్టుకున్నారు.
- వేదికపై మంత్రి మల్లారెడ్డి కళాకారులతో నృత్యం చేసి, సభలో ఉత్సాహాన్ని నింపారు.
- సీఎం సభ సందర్భంగా సభా ప్రాంగణానికి వచ్చే రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

- మేడ్చల్ రూరల్, అక్టోబర్ 18

## కమలం వాడిపోనుందా..?

### అభ్యర్థులను ప్రకటించకముందే చేతులెత్తేసిన కమలం

# బీజేపీకి ఒంటరి భయం..!!

- ప్రధాని, కేంద్రమంత్రులు ప్రచారం చేసినా.. కుదరని నమ్మకం
- బీఆర్‌ఎస్ ప్రజాభిమానంతో వెనక్కి తగ్గిన కాషాయం నేతలు
- తెలంగాణలో ఉనికిలేని జనసేన, టీడీపీ పొత్తుకు వెంపర్లాట
- జనసేనను కలిసి పొత్తుపై చర్చలు జరిపిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి
- బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమేనంటున్న బీజేపీ దుస్థితి ఇది

"బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే. ఈ తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధి ఏమీ జరగలేదు. మేం తెలంగాణ అభివృద్ధికి లక్ష కోట్ల రూపాయలు అందించాం. ప్రజలంతా కమలం వైపునే చూస్తున్నారు. వచ్చే ప్రభుత్వం బీజేపీదే.".. అని ఓవైపు ప్రధాని నరేంద్ర మోదీతో సహా.. మరోవైపు హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. ఇంకోవైపు పియూష్ గోయల్ ఇలా అనేక దిగ్గజ కేంద్ర మంత్రులు తెలంగాణ ఎన్నికల ప్రచారంలో బహిరంగ సభలు నిర్వహించి ఊకదంపుడు ఉపన్యాసాలు దంచికొడుతున్నారు. తెలంగాణను బీజేపీ ఖాతాలో వేసుకోవడం ఖాయమని వేదికలపై గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

**సీన్ కట్ చేస్తే..**

"ప్రధానితో సహా దిగ్గజ కేంద్ర మంత్రులది మేకపోతు గాంభీర్యమని తేలిపోయింది. వారివన్నీ ఊకదంపుడు ఉపన్యాసాలేనని రాష్ట్ర కాషాయ పార్టీ నాయకులు మరోసారి రుజువు చేశారు. ప్రధానితో సహా కేంద్ర మంత్రులు తెలంగాణ ఎన్నికల ప్రచారం మీద వారికి నమ్మకం లేదని పరోక్షంగా అంగీకరించారు. ప్రజల నుంచి కమలానికి ఆదరణ రాకపోవడంతో ఆ పార్టీ నేతలు తెలంగాణలో ఉనికే లేని పార్టీల పొత్తు కోసం ఉవిళ్లూరుతున్నారు. దేశమంతా తామేనని చెప్పకుంటున్న నాయకులు గల్లీలో కూడా ఎగురని జెండాతో కలవడానికి వెంపర్లాడుతున్నారు. జాతీయ పార్టీ అని చెప్పకుంటున్న బీజేపీ ఒంటరిగా బరిలోకి దిగేందుకు భయపడుతుందని తేలిపోయింది. బీఆర్‌ఎస్ దూకుడు ముందు నిలవలేమని చేతులెత్తేసింది. అభ్యర్థుల ప్రకటనకు ముందే ఓటమి ఒప్పుకున్నది. పొత్తుకు ప్రయత్నించడంపై సొంత పార్టీ నేతల్లోనూ వ్యతిరేకత వ్యక్తమవుతున్నది."

సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కమలానికి ఓటమి భయం పట్టుకున్నది. ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగడానికి జంకుతున్నది. ప్రజల్లో బీఆర్‌ఎస్‌కు వస్తున్న అనూహ్య స్పందనకు రాష్ట్ర, జాతీయ నాయకుల వరకు వణుకు పట్టుకున్నది. ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులు అంతా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైనప్పటికీ ఓటర్లను బీఆర్‌ఎస్ నుంచి మళ్లించడం కష్టమని వారికి అర్థమయ్యింది. అధికార పార్టీని ఢీకొట్టడమంటే ఆషా మాషీ కాదని జాతీయ పార్టీకి బోధపడింది. అందుకే ఎన్నికల్లో పొత్తు రాజకీయాలకు బీజేపీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే మొన్న టీడీపీ నారా లోకేశ్‌ను అమిత్ షాతో కలిపించిన కిషన్ రెడ్డి.. తాజాగా జనసేన అధినేత పవణ్ కల్యాణ్‌ను కలవడం హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కూడా పొత్తుకు అంగీకరించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అటు టీడీపీ.. ఇటు జనసేన పొత్తు అంశం మరో రెండు రోజుల్లో కొలిక్కిరానున్నదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

### దేశమంతా.. దటీజ్ కేసీఆర్

తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచేల అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఇలా ఎన్నో పథకాలను అమలు చేశారు. తొలుత వీటిని చాలా మంది సాధ్యం కానివని ఎద్దేవ చేశారు. జాతీయ పార్టీ నాయకులు సైతం విమర్శలు చేశారు. కానీ కేసీఆర్ పెద్ద మనసుతో అభివృద్ధి వ్యూహాలతో వాటిని సాధ్యం చేసి తెలంగాణ ప్రజల మన్ననలు పొందారు. ఇప్పుడు అవే పథకాలను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్లు మార్చి పెట్టుకుంటున్నారు. దేశమంతా ఇవన్నీ కేసీఆర్ పథకాలలాగే ఉన్నాయని చర్చించుకుంటున్నారు. దటీజ్ కేసీఆర్ అని కొనియాడుతున్నారు. దేశవ్యాప్తంగా కేసీఆర్‌కు ఉన్న ఆదరణను చూసి కమలం పార్టీ బెంబేలెత్తిపోతున్నది. అందుకే ఏం అభివృద్ధి చేస్తామో చెప్పకుండా.. కేవలం సీఎంపై విమర్శలకే జాతీయ నాయకులు పరిమితమవడంపై ప్రజలకు విశ్వాసం లేకుండా పోయింది. సర్వేలో సైతం కేసీఆర్‌ను బీజేపీ ఢీకొట్టలేదని కమలం పెద్దలకు వెల్లడైంది. దీంతో వారంతా పొత్తుల బాటకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అందుకే పొత్తు రాజకీయాల్లో బీజేపీ మునిగిపోయింది.

### పొత్తుతో కొత్త తలనొప్పి తప్పదా..!

బీజేపీ పొత్తు రాజకీయాలపై సొంత పార్టీ నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రేటర్‌లో కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ తదితర నియోజకవర్గాల్లో బీజేపీ, టీడీపీ, జనసేనలు వేర్వేరుగా బరిలో ఉండేందుకు ఆ పార్టీలో ఏండ్లుగా పనిచేస్తున్న ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. పొత్తు కుదిరితే నియోజకవర్గాల్లో సంబంధిత పార్టీ అభ్యర్థులు ఎవ్వరో ఒక్కరూ సీటు త్యాగం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియపై ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తున్నది. అందుకే సమన్యాయం పాటించే అధికార పార్టీయే బెటర్ అని విరివిగా గులాబీ కండువా కప్పుకుంటున్నారు. పొత్తు కుదిరితే ఇప్పటికే తమ అనుచరులను జాబితాలో చేర్చాలనుకున్న వ్యక్తుల పేర్లు కూడా మాయమయ్యే పరిస్థితులుంటాయని బీజేపీలోని ఓ వర్గం కలవరపడుతున్నది. మరోవైపు ఒంటరిగా వెళ్లినా.. పొత్తుతో వెళ్లినా గెలిచేది లేదు.. వచ్చేది లేదని ఆ పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు.